# జనరల్ సైన్స్

## పర్యావరణం – ప్రాథమిక భావనలు

**మానవుడు తనకు అవసరమైన వస్తుసేవల ఉత్పత్తి కోసం (ఆర్థికాభివృద్ధి) పర్యావరణ వనరులను విచక్షణారహితంగా ఉపయోగిస్తున్నాడు. దీంతో పర్యావరణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాతావరణంలో కాలుష్యం అధికమవుతోంది. జీవవైవిధ్యం దెబ్బతిని కొన్ని జీవరాశులు, వనరులు క్షీణిస్తుండటంతో మానవ మనుగడకు ముప్పు పొంచి ఉంది. ఈ సవాలును ఎదుర్కోవాలంటే పర్యావరణానికి హాని కలిగించని రీతిలో సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక కార్యకలాపాలను శాస్త్రీయ స్పృహతో నిర్వహించేలా ప్రభుత్వాలు, ప్రజలు సరైన అవగాహన ఏర్పరచుకోవాలి.**

అర్థం: పర్యావరణం అంటే 'ఏదైనా జీవి లేదా జీవ సముదాయాన్ని ఆవరించి ఉన్న జీవ, నిర్జీవ అనుఘటకాలు, వాటి మధ్య జరిగే అంతః చర్యల కలయిక'.

- ✦ పర్యావరణం అనే తెలుగు మాటకు ఉపయోగించే ఆంగ్ల పదం 'Environment'.
- ✦ 'Environment' అనే ఆంగ్ల పదానికి మూలం Environ (or) Environor అనే ఫ్రెంచ్ భాషాపదం.
- ✦ ఫ్రెంచ్ భాషలో Environ అంటే 'ఆవరణ' లేదా 'చుట్టుకుని ఉండేది' అని అర్థం.

### పర్యావరణం ముఖ్య లక్షణాలు

- ✦ పర్యావరణం అనేది ఒక 'గతిశీలమైన వ్యవస్థ'. అంటే ఇది ప్రాంతాన్నిబట్టి, కాలాన్ని బట్టి అనేక మార్పులకు లోనవుతూ ఉంటుంది.
- ✦ పర్యావరణం మనుగడ అందులోని జీవ, నిర్జీవ అంశాల మధ్య ఉన్న సంబంధాలు, అంతఃచర్యలపై ఆధారపడి ఉంటుంది.
- ✦ పర్యావరణ నిర్వహణ విధానం అందులోని శక్తి ప్రవాహాలపై ఆధారపడి ఉంటుంది.
- ✦ ఆవరణ వ్యవస్థల సమతౌల్యతను కాపాడటం పర్యావరణ వ్యవస్థ ముఖ్య లక్షణం.
- ✦ పర్యావరణంలో సేంద్రీయ పదార్థ ఉత్పాదన అనేది ప్రాంతాన్ని బట్టి, శీతోష్ణస్థితిని బట్టి మారుతూ ఉంటుంది.

### పర్యావరణం – విధులు

- ✦ ఆర్థిక వస్తువుల ఉత్పత్తికి అవసరమైన సహజ వనరులను అందిస్తుంది.
- ✦ ఆర్థిక కార్యకలాపాల వల్ల ఉత్పన్నమయ్యే వ్యర్థాలను తనలో విలీనం చేసుకుంటుంది.
- ✦ జీవావరణ సమతౌల్యాన్ని కాపాడటానికి అవసరమైన ప్రాణాధార సేవలను అందిస్తుంది.

### పర్యావరణం రకాలు లేదా నిర్మాణం

పర్యావరణం రెండు రకాలు. అవి: 1) సహజ పర్యావరణం 2) కృత్రిమ పర్యావరణం

### సహజ పర్యావరణం

ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన పర్యావరణాన్ని సహజ లేదా స్వాభావిక పర్యావరణం అంటారు.

- ✦ సహజ పర్యావరణాన్ని రెండు రకాలుగా విభజించారు. అవి: ఎ) భౌతిక లేదా నిర్జీవ పర్యావరణం బి) జీవ పర్యావరణం.



### భౌతిక లేదా నిర్జీవ పర్యావరణం

ప్రాణం లేకుండా ఏర్పడిన సహజ రాశులన్నింటినీ కలిపి 'భౌతిక పర్యావరణం' (Physical or Abiotic Environment) అంటారు. **ఉదా:** గాలి, నీరు, నేల మొదలైనవి. భౌతిక పర్యావరణాన్ని కింది విధంగా విభజించవచ్చు i) శిలావరణం (Lithosphere), ii) జలావరణం (Hydrosphere), iii) వాతావరణం (Atmosphere).

### శిలావరణం

✦ భూమి మీద ఉన్న రాతి పొరనే 'శిలావరణం' అంటారు

లేదా

భూమి మీద మట్టి, ఇసుక కలిగి ఉండే పై పొరను 'శిలావరణం' అంటారు.

✦ శిలల గురించి అధ్యయనం చేసే శాస్త్రం 'లిథాలజీ' (Lithology).

✦ శిలలు/ రాళ్లు వాతావరణ మార్పుల వల్ల మృత్తికగా మారతాయి. ఈ ప్రక్రియనే 'శిలా శైథిల్యం' లేదా 'పెడోజెనిసిస్' అంటారు.

### జలావరణం

భూమిపై నాలుగింట మూడు వంతులు (3/4) నీరు వ్యాపించి ఉంది.

✦ భూమిపై ఉన్న (ఉపరితలపు నీరు, భూగర్భ జలాలు) మొత్తం నీటిని 'జలావరణం' అంటారు.

✦ భూమిపై ఉన్న సముద్రాలు, నదులు, సరస్సులు, కాలువలు, ధ్రువప్రాంతపు మంచు మొదలైన వాటన్నింటినీ 'ఉపరితల జలవనరులు' అంటారు.

✦ భూమి లోపలి పొరల్లో ఉన్న నీటిని 'భూగర్భ జలాలు' అంటారు.

✦ జలావరణంలోని మొత్తం నీటిలో సుమారు 97% సముద్రపు ఉప్పు నీటి రూపంలో ఉంది. మిగిలిన 3% భూమిపై ఉన్న మంచి నీరు. కానీ ఈ మంచినీటిలో అధికభాగం ధ్రువాల వద్ద మంచు రూపంలో (సుమారు 2%) ఉంది. ఇక మానవ అవసరాలకు ఉపయోగపడే మంచినీటి శాతం 1% కంటే తక్కువ.

| నీరు లభించే ప్రాంతం | శాతం |
|---|---|
| 1. సముద్రాలు | 97% |
| 2. గ్లేసియర్స్, ధ్రువ ప్రాంతంలో మంచు రూపంలో ఉన్న నీరు | 2% |
| 3. భూగర్భ జలాలు, నదులు, చెరువులు, సరస్సులు మొదలైనవాటిలో ఉన్న నీరు | 1% |

✦ మంచినీటి భౌతిక, రసాయన, జీవ అంశాల అధ్యయన శాస్త్రాన్ని 'లిమ్నాలజీ' అంటారు.

✦ 2005 నుంచి మార్చి 22 ను 'ప్రపంచ జల దినోత్సవం' (World Water Day) గా నిర్వహిస్తున్నారు.

### వాతావరణం

భూమిని ఆవరించి ఉన్న దట్టమైన గాలి పొరను 'వాతావరణం' అంటారు. ఇది భూమి నుంచి దాదాపు 1600 కి.మీ.ల వరకు వ్యాపించి ఉంది. వాతావరణ సంఘటనంలో ఘన, ద్రవ, వాయు పదార్థాలు ఉన్నాయి.

✦ భూమి ఉపరితలం నుంచి వాతావరణంలోకి చేరే దుమ్ము, ధూళి రేణువులు, కాలుష్యకారక రేణువులు - వాతావరణంలోని ఘన పదార్థాలు.

✦ వాతావరణంలోకి చేరే నీటి ఆవిరిని ద్రవపదార్థంగా పేర్కొనవచ్చు.

✦ 'క్లోరిన్' వాయువు తప్ప మిగిలిన వాయువులన్నీ భూవాతావరణంలో ఉన్నాయి.

| వాయువు | వాతావరణంలో పరిమాణం |
|---|---|
| ★ నైట్రోజన్ | 78.08% |
| ★ ఆక్సిజన్ | 20.94% |
| ★ కార్బన్ డై ఆక్సైడ్ | 0.03% |
| ★ ఆర్గాన్ | 0.93% |

✤ **నైట్రోజన్:** వాతావరణంలో అధిక శాతంలో ఉన్న వాయువు. జంతు విసర్జితాలు, కళేబరాలు కుళ్లడం వల్ల (ఒక విధమైన బ్యాక్టీరియా చర్య) నైట్రోజన్ వాయువు గాలిలోకి విడుదలవుతుంది.

✦ లెగ్యూమినేసి మొక్కలున్న ప్రాంతాల్లో గాలిలో నైట్రోజన్ పరిమాణం కొద్దిగా తక్కువగా, నేలలో ఎక్కువగా ఉంటుంది.

✦ మొక్కలు నత్రజనిని నైట్రేట్స్, నైట్రైట్స్, అమ్మోనియం అనే నత్రజని లవణాల రూపంలో గ్రహించగలుగుతాయి.

✦ కీటకాహార మొక్కలు పెరిగే నేలల్లో 'నత్రజని' లోపించి ఉంటుంది.

✦ వాతావరణంలో ఆక్సిజన్ దహన ప్రక్రియను స్థిరీకరించగలదు.

✤ **ఆక్సిజన్ లేదా ప్రాణవాయువు:** వాతావరణంలో అత్యధిక పరిమాణంలో ఉండే రెండో వాయువు. ఇది జీవుల శ్వాసక్రియలో కీలకపాత్ర వహిస్తుంది.

✦ భూమి ఉపరితలంలో 'ఓజోన్' వాయువు/ పొరను ఏర్పరుస్తుంది. వృక్ష సంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లోని గాలిలో ఆక్సిజన్ అధిక పరిమాణంలో ఉంటుంది.

✤ **కార్బన్ డై ఆక్సైడ్:** దీన్ని 'బొగ్గుపులుసు వాయువు' అని కూడా అంటారు. ఆకుపచ్చని మొక్కలు సూర్యరశ్మి సమక్షంలో ఆహారాన్ని తయారుచేసుకోవడానికి, ఆమ్లజనిని విడుదల చేయడానికి కార్బన్ డై ఆక్సైడ్ అవసరం.

✦ భూమి మీద ఉష్ణోగ్రతలను స్థిరంగా ఉంచడానికి వాతావరణంలో నిర్ణీత మొత్తంలో కార్బన్ డై ఆక్సైడ్ అవసరం.

✦ 'గ్లోబల్ వార్మింగ్'కు ప్రధాన కారక వాయువు ఇదే.

✦ ఇది మంటలు మండటానికి తోడ్పడదు. అందుకే అగ్నిమాపక యంత్రాల్లో దీన్ని ఉపయోగిస్తారు.

✦ దీన్ని సోడాలు, శీతల పానీయాలు, కేకుల తయారీలో వినియోగిస్తారు.

✤ **ఆర్గాన్:** వాతావరణంలో అధిక శాతంలో ఉన్న జడవాయువు. ఎక్కువ మన్నిక గల ఎలక్ట్రిక్ బల్బుల్లో జడవాయువులను నింపుతారు.

### *నీటి ఆవిరి, ధూళి, దుమ్ము రేణువులు:*

✦ వాతావరణంలో నీటి ఆవిరి, ధూళి, దుమ్ము రేణువులు అన్ని ప్రదేశాల్లో స్థిరంగా ఉండక, మార్పు చెందుతూ ఉంటాయి.

✦ నీటి ఆవిరి సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా, పీఠభూమి ప్రాంతాల్లో తక్కువగా ఉంటుంది.

✦ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు గాలిలో నీటి ఆవిరి ఎక్కువగా, ఉష్ణోగ్రత తగ్గినప్పుడు నీటి ఆవిరి తక్కువగా ఉంటుంది.

✦ శీతాకాలంలో గాలిలో నీటి ఆవిరి అధికంగా ఉండి నీటిమంచు, పొగమంచు ఏర్పడతాయి.

### *జీవ పర్యావరణం లేదా జీవావరణం*

✦ జీవ సముదాయాలతో నిండి ఉన్న భూమి ఉపరితల భాగాన్ని 'జీవావరణం' అంటారు.

✦ శిలావరణం, జలావరణం, వాతావరణాలు కలుసుకునే సంధి ప్రాంతంలో జీవ భూరసాయన వలయాల ద్వారా పదార్థ మార్పిడి ($CO_2, O_2, N_2, H_2O$ మొదలైనవి) నిరంతరం జరుగుతూ జీవజాతుల ఆవిర్భావానికి, మనుగడకు కావాల్సిన అనుకూల భౌతిక పరిసరాలు ఏర్పడి ఉన్నాయి. ఈ భౌతిక పరిసరాల్లో నివసించే సమస్త జీవజాతినే 'జీవావరణం' అని పిలుస్తారు.

✦ సముద్రమట్టానికి కింద 20 కి.మీ. లోతు నుంచి పైన ఓజోన్ పొర వరకు ఉన్న వాతావరణ భాగాన్ని 'జీవావరణం' అంటారు. ఈ విధంగా పర్యావరణం నాలుగు ఆవరణాలతో కూడిన (వాతావరణం, శిలావరణం, జలావరణం, జీవావరణం) "సమ్మిళిత ఆవరణం లేదా సమగ్ర ఆవరణం".

✦ ఇది జీవ, నిర్జీవ అంశాల/ భాగాలకు మొత్తానికి చెందింది. దీనికి సరిహద్దులు లేవు, విశ్వమంతటా వ్యాపించి ఉంది. పర్యావరణంలో మానవుడు ఒక కేంద్ర బిందువు. పర్యావరణ వ్యవస్థలోని వివిధ నిర్మాణాలను మానవుడు మార్పు చేస్తూ తన కార్యకలాపాలతో పర్యావరణాన్ని ప్రభావితం చేస్తున్నాడు.



www.eenadupratibha.net
www.eenadupratibha.net

**నమూనా ప్రశ్నలు**

**1.** పర్యావరణం (Environment) అనే పదానికి కింది ఏ భాషాపదం ఆధారం?

1) గ్రీకు 2) లాటిన్ 3) అరబ్ 4) ఫ్రెంచ్

**2.** 'జీవావరణం' కింది ఏ ఆవరణల్లో విస్తరించి ఉంటుంది?

1) శిలావరణం, జలావరణం 2) జలావరణం, వాతావరణం

3) వాతావరణం, శిలావరణం, జలావరణం 4) వాతావరణం, శిలావరణం

**3.** పర్యావరణం లక్షణం కానిది?

1) పర్యావరణం సేంద్రీయ పదార్థాలను తనే ఉత్పత్తి చేసుకుంటుంది.

2) పర్యావరణ నిర్వహణ అందులోని 'శక్తి ప్రవాహాలపై' ఆధారపడి ఉంటుంది.

3) పర్యావరణం మనుగడ అందులోని జీవ-నిర్జీవ అంశాల అంతఃచర్యలపై ఆధారపడుతుంది.

4) పర్యావరణం మార్పులకు లోనుకాని వ్యవస్థ.

**4.** నిర్జీవ లేదా భౌతిక పర్యావరణానికి సంబంధించని ఆవరణం ఏది?

1) శిలావరణం 2) జలావరణం 3) జీవావరణం 4) వాతావరణం

**5.** ఏ ఆవరణాన్ని 'కార్బన్ సింక్'గా వ్యవహరిస్తారు?

1) జీవావరణం 2) జలావరణం 3) వాతావరణం 4) శిలావరణం

**6.** ఒక రైతు పొలంలో 'నైట్రేట్స్' పుష్కలంగా ఉన్నాయి. అంటే అతడు తన పొలంలో ఏ పంటను పండించి ఉండొచ్చు?

1) లెగ్యూమినేసి పంటలు 2) చిక్కుడు జాతి పంటలు

3) ఫాబేసి జాతి పంటలు 4) పైవన్నీ సరైనవి

**7.** వాతావరణంలో అధిక మొత్తంలో ఉన్న జడవాయువు ఏది?

1) హీలియం 2) నియాన్ 3) ఆర్గాన్ 4) రేడాన్

**8.** వాతావరణంలో ఉష్ణోగ్రతల స్థిరీకరణకు, మొక్కల ఆహారోత్పాదనకు, భూతాపానికి కారణమవుతున్న ప్రధాన వాయువు ఏది?

1) నైట్రోజన్ 2) కార్బన్ మోనాక్సైడ్

3) కార్బన్ డై ఆక్సైడ్ 4) క్లోరోఫ్లోరోకార్బన్లు

**9.** కిందివాటిలో సరిగ్గా జతపరిచిన అంశం ఏది?

1) ప్రపంచ జల దినోత్సవం - మార్చి 22

2) లిమ్నాలజి - మంచినీటి అధ్యయన శాస్త్రం

3) భూమిపై ఉన్న మంచినీరు 1% (మానవ అవసరాలకు ఉపయోగపడేది)

4) పైవన్నీ సరైనవి

**10.** భూ వాతావరణంలో లభించని వాయువు ఏది?

1) గ్జినాన్ 2) రేడాన్ 3) క్లోరిన్ 4) క్రిప్టాన్

**జవాబులు**

1-4; 2-3; 3-4; 4-3; 5-2; 6-4; 7-3; 8-3; 9-4; 10-3.

**-పి. బాబా ఫక్రుద్దీన్**